
# ఎలీసా! ఎలీసా!



అదో హాస్పిటల్ అనీ, ఆ పసివాడుండేది ఇన్‌క్యుబేటర్ అనీ స్ఫురించదు. అదో మంట రాని చితి అనీ, ఆ పసివాడు లోలోపల తగలబడుతున్న మధువనం అనీ అనిపిస్తుంది. జాలిజాలిగా, సానుభూతిగా, భగవంతుడా ఎంత పనిచేశావురా అంటూ నిట్టూర్పుగా ఎన్నివందల, వేల కళ్ళు ఆ పసివాడివైపు చూశాయో లెక్కలేదు. ఆ చూపులకు వాడివైపు నుంచి ప్రతిస్పందన ఉండదు. వాడి కళ్ళ వెనుకనున్న ఆప్టిక్ నర్వ్ ఫైబర్స్‌పై ప్రపంచ చిత్రపటాల ప్రతిమలు ప్రసరించవు.

డాక్టర్ మాధురి ఎయిడ్స్ రిసెర్చి సెంటరులో ప్రత్యేకంగా నిర్మించిన గాజు గది లాంటి ఇన్‌క్యుబేటర్‌లో ఆ పసికూన ఆజన్మ ఖైదీ. ప్రపంచంలోకి కాలుపెట్టిన కొద్ది గంటల లోనే వాడికి ఎయిడ్స్ వైరస్ సోకింది. ఒకానొక బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూషన్ దుష్టక్షణంలో వాడి జీవవ్యవస్థలోకి ప్రవేశించింది వైరస్.

వాడికి తల్లి రొమ్ము స్పర్శ తెలియదు. అమ్మ పాలలోని వెచ్చదనం, తీపి, భాషకందని అలౌకిక మాధుర్యమేదో అదీ తెలియదు. అమ్మకాళ్ళపై పడుకోబెట్టుకొని లాలనగా స్నానం చేయించడమూ తెలియదు. వాడి అనుభూతులు, ఆనందాలూ ఆ గదిలోనే గడిచిపోయాయి. వాణ్ణి ముట్టుకోవాలంటే అందరికీ భయం. వాడికి సపర్యలు చేయడానికి ఏ నర్సూ ముందుకు రాలేదు. ఆ వృద్ధ ఆంగ్లో ఇండియన్ నర్సు మేరీ ఫ్రాన్సిస్ మాత్రం "ప్రభువు రక్తంతో పరిశుద్ధమైన శరీరాలు మావి. మమ్మల్నే ఎయిడ్స్‌వైరస్ అంటదు" అంటూ వాడికి ఆయాగా ఉండడానికి ఒప్పుకొంది. వాడి ప్రపంచానికి తెలిసిన ఒకే ఒక స్పందన రెండు ధవళవర్ణపు మానవరూపాలు - డాక్టర్ మాధురి, సిస్టర్ మేరీ. వాడికి పేరంటూ ఏమీలేదు. 'ఏప్స్యీ' అని పిలుస్తుంటారు. ఎయిడ్స్

పేషెంట్ అండర్ అబ్జర్వేషన్ (ఎ.పి.యు.ఒ).

ఒక భయంకరమైన శాపాన్ని గర్భసంచిలో తొమ్మిది నెలలు మోసి, శిశువు రూపంలోని మృత్యుగీతానికి జన్మనిచ్చిన మాతృమూర్తి లలిత. సెక్రటేరియట్‌లో చిన్న ఉద్యోగం ఆమెది. పిల్లలు పుట్టాక ఉద్యోగం మానేసి సమయమంతా శిశు సంరక్షణలోనే గడపాలని కలలు కంది లలిత. భర్త కూడా అంగీకరించాడు. పిల్లవాణ్ణి ఆయాల చేతుల్లో పడకుండా తన దగ్గరే ఉంచుకోవాలనుకున్న మాతృస్వప్నం ఆమెది. అన్ని జాగ్రత్తలూ తీసుకొంది. అవసరమైన టీకాలు, రక్తవృద్ధి టానిక్కులు, ఆకు కూరలు, పాలు, గుడ్లు డాక్టరమ్మ చెప్పినట్లే తు.చ. తప్పకుండా తీసుకొంది. కాన్పుకూడా ఖర్చుకు భయపడకుండా ఖరీదైన నర్సింగ్ హోమ్‌లో చేయించుకొంది. మృత్యువుకున్న వేలాది రాక్షసావతారాల్లో అత్యంత ప్రమాదకరమైన అవతారం హెచ్.ఐ.వి. వైరస్ శిశువును తన క్రూరహస్తాల కౌగిలిలోకి లాక్కుంది. పుట్టుకతో వచ్చిన ఎనీమియాకు చికిత్సగా బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూషన్ ఇవ్వాల్సి వచ్చింది. బిడ్డకు ఎక్కించిన రక్తంలో ఎయిడ్స్ వైరస్ వుంది. ఆ శిశువు ఐదేళ్ళకు మించి బ్రతకదని తెలిసినా, ఏదో ఆరాటం. వాడికి వైద్యం చేయిస్తే బ్రతుకుతాడని ఆశ. ఏ డాక్టరూ ముందుకు రాలేదు. ఎయిడ్స్ పరిశోధనలో ఆపాటికే పేరు సంపాదించుకున్న డాక్టర్ మాధురి దయతో తన వైద్యాలయంలో ఆశ్రయమిచ్చింది. వాడినందరూ 'ఏప్యూ' అని పిలుస్తారు. లలితమాత్రం 'వంశీ' అని పిలుచుకొంటుంది. వాడుండే గదిలోకి ఆవిడ ప్రవేశం నిషిద్ధం. రొమ్ములలో పాల సముద్రాల హోరు. కళ్ళలో కన్నీటి జలపాతాల తాకిడి. షోకేసులో అందంగా అలంకరించిన బొమ్మను చూసినట్లుగా బిడ్డను చూస్తుంది. ఆమె గుండెలోని స్పందనలు గాజుతెరల్ని చీల్చుకుని ఆ పసిగుండెల్ని తాకాలని ఆమె కోరిక. వాణ్ణి దగ్గరకు తీసుకొని, ముద్దుచేసి, లాలించి, వాడితో ఆటలాడాలని ఉంటుంది లలితకు. "అలాంటి పిచ్చి కోర్కెలు కోరవద్దు. వాడిది చాలా సున్నితమైన శరీరం. బయట నుంచి వచ్చే ఏ ఇన్‌ఫెక్షన్‌కూ తట్టుకోలేడు. పూర్తిగా స్టెరైల్‌చేసిన వాతావరణమది. ఆ గదిలోకి ఎవర్నీ పంపే ప్రసక్తిలేదు" అంటూ కోప్పడుతుంది మాధురి.

ఆరేళ్ళ ఎలీసాకు చుట్టూ ఉన్న పరిసరాల రహస్యాలన్నీ పూర్తిగా అంతు చిక్కలేదు. తన పేరే తనకో అంతుపట్టని పజిల్. "ఎలీసా ఏమిటి సీసాలాగ. రాణి, ప్రణవి, లావణ్య అంటూ ఏదో మంచి పేరు పెట్టక" అని తల్లి దగ్గర చాలాసార్లు విసుక్కుంది. "ఎలీసా ఒక సీరమ్ టెస్ట్. ఎయిడ్స్ పేషెంట్ల రక్తంలో వైరస్‌ను కనిపెట్టే పరీక్ష. ఆ పరీక్ష అంటే నాకు ప్రాణం కదా! అందుకే ఆ పేరు నీకు పెట్టాను" అంటుంది ఎలీసా తల్లి డాక్టర్ మాధురి. మళ్ళీ సందేహాలు. సీరమ్ టెస్ట్ అంటే ఏమిటి? ఎయిడ్స్ అంటే ఏమిటి?

ఎలీసాను కలవరపెట్టే మరో రహస్యం 'ఏప్యూ'. వాడకా గాజుగదుల ఖైదు ఎందుకో ఎలీసాకు అర్థంకాలేదు. మమ్మీనడిగితే "పూర్‌ఫెలో! వాడో ఎయిడ్స్ విక్టిమ్. స్లోలీ మూవింగ్ ఇన్‌టుది ఎటర్నల్ వెబ్ ఆఫ్ డెత్. వాడిలో రోగ నిరోధకశక్తి లేదు. అందుకే వాణ్ణి రక్షిత ప్రదేశంలో ఉంచాము" అంటుంది. మళ్ళీ ప్రశ్న. "ఎయిడ్స్ అంటే ఏమిటి మమ్మీ?" "అదో ప్రమాదకరమైన జబ్బు. ఆ జబ్బుకు ఇంకా మందు కనిపెట్టలేదు. ఆ జబ్బు ఒకసారి వస్తే

చనిపోయినట్లే లెక్క". మాధురి సమాధానం ఎలీసాకు పూర్తిగా అర్థం కాలేదు. ఎలీసాదొక మధురమైన ప్రపంచం. తెలిమబ్బుల మోహనరాగాలు, చిన్నారి పాపల కేరింతలు, చిటపటమంటూ లయాత్మకంగా సాగే వానజల్లులు, ఖరీదైన చాక్లెట్లు, చిన్నారి టామీతో లాన్‌లో గంతు లెయ్యటం. స్కూల్లో మాధవి, మనో, కీర్తి, లావణ్యలతో ఆటలు - శ్రావ్యంగా గానం చేసిన పాటలాంటిది ఎలీసా ప్రపంచం. ఏ పిల్లవాడి ప్రపంచంలోనైనా ఆటలు, తీయని కబుర్లు, అల్లరి మాత్రం ఉంటాయని తన నమ్మకం. అందుకు భిన్నంగా జీవించే 'ఏప్యూ'ని చూస్తే ఎలీసాకు దిగులు వేస్తుంది. గాజు గదికి ఈవల నుంచుని గంటల తరబడి వాణ్ణి దీక్షగా పరికిస్తుంది. ఒక చిన్న చిరునవ్వు, కాకుంటే ఒక స్పందన, కనీసం కదలిక ఉంటుందేమోనని చూస్తుంది. ప్రతిబింబం చూపని అద్దంలా వాడు నిర్లిప్తంగా చూస్తూ ఉంటాడు.

"నమస్తే ఆంటీ! నా పేరు ఎలీసా! డాక్టరుగారి అమ్మాయిని. ఆ బాబు మీ బాబా ఆంటీ! వెరీ క్యూట్ ఆంటీ! వాడికి చాక్లెట్లు ఇవ్వండి." ఎలీసా స్కూల్ బ్యాగ్ తెరిచింది. చాక్లెట్లు, రంగు పెన్సిళ్ళు, స్కేలు, రబ్బరు, బెలూన్లు, లంచ్ టైమ్‌లో ఆడుకోవడానికి రింగ్‌బాల్, ఒక మూలన ఒదిగి మధురంగా పరిమళిస్తున్న గులాబీ మొగ్గలు, చిన్న టిఫిన్‌బాక్స్ వగైరా ఉన్నాయా బ్యాగ్‌లో. సృజనాత్మకమైన ఒక స్వప్న ప్రపంచం ఆ చిన్న బాగ్‌లో దాగి ఉంది. ఎలీసా ఇచ్చిన చాక్లెట్లవైపు, ఆ తరువాత ఎలీసావైపు చూసింది. లలితను ఒక్కసారిగా పెనురోదన చుట్టుముట్టింది. నోటికి పైటచెంగు అడ్డుపెట్టుకొని వెక్కివెక్కి ఏడ్చింది.

"ఎందుకు ఆంటీ, ఎందుకు ఏడుస్తున్నారు! ప్లీజ్ ఆంటీ! నాకు దిగులు వేస్తుంది. ఏడవకండి ఆంటీ!" లలిత తేరుకొని కళ్ళు తుడుచుకుంది. "చాక్లెట్లు, రంగు బుడగలు, ఏమీ ఎరుగని నిర్భాగ్యుడు నా బిడ్డ, గోరుముద్దలు, మీగడతరకలు, స్నేహితులు, వెచ్చని కౌగిళ్ళు, ఆటలు, ఆనందాలు నోచుకోలేని నిర్భాగ్యుడు వాడు." 'అయ్యో తండ్రీ! ఎందుకురా నా కడుపున పుట్టావు? నిన్ను మ్యూజియంలో బొమ్మను చేశారు. లేబరేటరీ పరికరాన్ని చేశారు. నా తండ్రీ ఎందుకురా నీకి శిక్ష! బాబూ! కన్నా, నా తండ్రీ!' స్వగతంలాగా ఏదేదో గొణుక్కుంది లలిత. గాలి తాకిడికి ఉలిక్కిపడి క్షణక్షణానికి డిస్టర్బ్ అవుతున్న ఎండుటాకులా ఉంది లలిత.

ఎలీసాకు దిగులు వేసింది. ఎవరి ఏడుపు చూసినా ఇట్టే చలించిపోతుందా పాప. నవ్వులు, కేరింతలు ఉండే ప్రపంచం కోసం కలలు కంటుంది రోజూ. స్కూల్లో ప్రేయర్ టైమ్‌లో కూడా దేవుణ్ణి అదే అడుగుతుంది. "సారీ ఆంటీ!" చాక్లెట్లు అక్కడ పెట్టి నిశ్శబ్దంగా వెళ్ళిపోయింది.

ఎయిడ్స్ గురించి తెలుసుకోవాలనే జిజ్ఞాస విషక్రిమిలా ఎలీసాను తొలుస్తోంది. టీవీలో ఆమాట వినటం తప్ప దాని గురించి ఏమీ తెలియదు. క్యూరియాసిటీ ఆపుకోలేక టీచర్ని అడిగింది. టీచర్ కాస్త ఇబ్బందిపడి. "అదో భయంకరమైన జబ్బు. దానికి మందేలేదు" అంది. మమ్మీకూడా ఇలాగే చెప్పింది. కానీ ఎలా వస్తుందో చెప్పలేదు. "ఏప్యూ'కి ఎలా వచ్చిందో అర్థం కావటం లేదు. వాణ్ణెందుకు అద్దాలఖైదులో ఉంచారో అర్థం

కాలేదు. స్కూలు లేదు. ఫ్రెండ్స్ లేరు. ఐస్‌క్రీమ్ పార్లర్ లేదు. గాలిపటాలు ఎగురవేయటం లేదు. మిక్కీమౌస్, డోనాల్డ్ డక్ వగైరా కామిక్ బుక్స్‌లేవు. స్వీట్లు, కేకులు సరేసరి. గుడ్ గాడ్! అలాంటి ఖైదులో పిల్లలు ఎలా ఉండగలుగుతారు? 'ఏప్యూ' గురించి ఎలీసా గుండెల్లో చిన్న దిగులు చెమ్మ ఎగిసింది. గులాబీ రేకులపై అంటిన మంచు తడిలా ఎలీసా కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

మరో రోజు........ "గుడ్ మార్నింగ్ ఆంటీ! ఈ రోజు మీ ముఖంలో సంతోషం కనిపిస్తుంది ఏమిటి విశేషం?" ఎలీసా అడిగింది. "బాబు నన్ను చూసి నవ్వాడు. ఇందాక డాక్టర్ వాణ్ణి టెస్ట్ చెయ్యడానికి వెళ్ళింది. నేను తులుపు దగ్గర నుంచున్నాను. నన్ను చూసి వాడి సన్నని పెదవులు విచ్చుకొని సన్నని నవ్వు తళుక్కుమంది. బంగారుతండ్రి! వాణ్ణి కౌగిలించుకొన్నంత ఆనందం వేసింది. వాడి హెల్త్ కండిషన్ మునుపటికంటే బాగుందట. ఊపిరితిత్తుల నెమ్ము కంట్రోల్ అయిందట. ఆకలి పెరిగిందట. చక్కగా ఫీడింగ్ తీసుకొంటున్నాడట. పిచ్చితండ్రి! అమ్మ ఒళ్ళో పడుకొని గోరుముద్దలు పెట్టించుకోవాల్సిన వయసులో ట్యూబులతో, గొట్టాలతో తినవలసివస్తోంది." హఠాత్తుగా లలిత మాట్లాడటం ఆపివేసింది. ఎక్కువసేపు మాట్లాడితే మళ్ళీ దుఃఖపు తెర తోసుకువచ్చి ఆకాస్త చిరుహాసాన్ని చిదిపివేస్తుందని భయపడింది.

మరో రోజు... ఆరోజు ఆదివారం. ఎలీసాకు ఫ్రెండ్స్‌తో పిక్నిక్ ప్రోగ్రాం ఉంది. దాన్ని కాన్సిల్ చేసుకొని హాస్పిటల్‌కు వచ్చింది. 'ఏప్యూ' గురించి ఎన్నాళ్ళుగానో తనను వేధిస్తున్న ప్రశ్నలకు సమాధానాలు శోధించాలని నిర్ణయించుకొంది ఎలీసా. ది లిటిల్ ప్రొఫెసర్ ఇన్ ఏక్షన్. హాస్పిటల్‌లో ప్రవేశించే సమయానికి లలిత నర్సును దీనంగా ప్రాధేయపడుతోంది. "ప్లీజ్ మేరీ! ఒక్కసారి... ఒక్కసారంటే ఒక్కసారి! నీకు దండం పెడతాను." "కుదరదమ్మా! చెబితే వినిపించుకోవు. నీ ప్రాణాలకే ముప్పు. ఇన్ని మాస్కులు, ప్రొటెక్షన్లతో మేమే లోపలికి వెళ్ళాలంటే భయపడతాము. నువ్వెక్కడ పోతావు? ఎయిడ్స్ అంటే నీకు సరిగ్గా అర్థమయినట్లు లేదు. వెళ్ళు! వెళ్ళు! డాక్టరమ్మకు తెలిస్తే ఇట్లా ఉదయంపూట రావటం కూడా బంద్ చేయిస్తుంది." సానుభూతిని అణచిపెట్టుకుని కోపం నటిస్తూ డ్యూటీ రూమ్‌లోకి వెళ్ళింది సిస్టర్ మేరీ.

"ఏమిటి ఆంటీ?" "ఏమీ లేదమ్మా! ఒక్కసారి వాణ్ణి ఎత్తుకుని ముద్దు చెయ్యాలని పిచ్చికోరిక. ఆ గదిలోకి వెళ్ళడానికి వీలులేదు అంటారు." నిట్టూర్చింది లలిత.

మరో రోజు.. ఆ ప్రదేశమంతా హడావిడిగా ఉంది. హఠాత్తుగా వాతావరణం ఉద్రిక్తంగా మారింది. 'ఏప్యూ' పల్స్ పడిపోయింది. డాక్టర్ మాధురి చాలా డిస్ట్రెస్‌గా ఉంది. ఈ కేసునో సవాలుగా తీసుకొంది. పరిశోధకురాలుగా ఈ కేసు తనకో మలుపు కావాలని ఆమె కోరిక. ప్రభుత్వం పరిశోధనల కోసం స్పెషల్ గ్రాంట్ మంజూరు చేసింది. విదేశాల్లో ట్రయల్‌లో ఉన్న మందులు అన్నీ తెప్పించి వాడిపైన ట్రై చేసింది. రెండేళ్ళపాటు వాణ్ణి జయప్రదంగా బ్రతికించుకోగలిగింది. ఇంతలో ఈ క్రైసిస్. ఎలీసాకు ఆ వాతావరణం నచ్చలేదు. యుద్ధ విమానమేదో తమమీదకు దాడికి వస్తున్నట్లు, కొంపలు మునుగుతున్నట్లు

అందరూ అలా బిగుసుకుపోయి ఉండటం... డామిట్! నిరుత్సాహంతో అక్కడనుంచి వెళ్ళిపోయింది.

మరో రోజు..... ఆరోజు క్రిస్మస్ రోజు. ఆంగ్లో-ఇండియన్ సిస్టర్ మేరీ ఉదయాన్నే కొత్త బట్టలతో హాస్పిటల్‌కు వచ్చింది. పొద్దునే 'ఏప్ర్యూ' దగ్గరకు వెళ్ళి వాడికో కొత్త చొక్కా వేసి, వాడికోసం ప్రేయర్ చేసి, వాడికి మార్నింగ్ ఫీడ్స్ ఇచ్చి గది తాళాలు డ్యూటీ రూమ్ గోడకు తగిలించి, "చర్చికి వెళ్ళి గంటలో వస్తాను" అంటూ వాచ్‌మన్‌కు చెప్పి వెళ్ళిపోయింది.

దట్టమైన మంచుతెర. ధవళ వర్ణపు చీరను అరకొరగా చుట్టుకొని, ఆ మేరకు చలిలో వణికిపోతున్నట్లుగా ఉందా ఉదయం. తన ఎడ్వెంచర్‌కు ఆ రోజునే ఎన్నుకుంది ఎలీసా. బ్యాగ్ నిండా చాక్లెట్లు, కేక్‌లు, చిన్నచిన్న బొమ్మలు మిక్కీమౌస్ సాఫ్ట్ టాయ్ వేసుకొంది. ఒకసారి మమ్మీ ఉన్న రూమ్‌లోకి తొంగి చూసింది. గాఢ నిద్రలో ఉంది. 'గుడ్! ఇంకో గంటదాకా నిద్రలేవదు' అనుకొంది.

మినీ సైకిల్‌కు బ్యాగ్ తగిలించుకొని హాస్పిటల్‌వైపు బయలుదేరింది. ఊహించినట్లే హాస్పిటల్ నిర్మానుష్యంగా ఉంది. నైట్‌డ్యూటీ స్టాఫ్ బల్లలపై కునికిపాట్లు పడుతున్నారు. డే డ్యూటీ స్టాఫ్ రావడానికి ఇంకా గంట పడుతుంది. 'ఏప్ర్యూ' ఉన్న స్పెషల్ వార్డు నిర్మానుష్యంగా వుంది. లలిత టెన్స్‌గా అక్కడ నిలబడి ఉంది. "గుడ్‌మార్నింగ్ ఆంటీ! హాపీ క్రిస్మస్ ఆంటీ!" ప్రేమగా గ్రీట్ చేసింది. తడి ఆరి ఎండిపోయిన నోటిని నాలుకతో తడుపుకుంటూ, "నాకు ఎందుకో భయంగా ఉంది పాపా! ప్రమాదం ఏమీ లేదు కదా?" అంది. "డోంట్ వర్రీ ఆంటీ! నీకేం ఫరవాలేదు. రండి!" భరోసాగా చెప్పింది ఎలీసా.

పిల్లిలా అడుగులు వేసుకుంటూ డ్యూటీ రూమ్‌కి వెళ్ళింది. తాళాలు తీసుకొని గ్లాస్ ఛేంబర్‌వైపు వెళ్ళింది. తాళాలు తీసి, తలుపు తెరిచి "రండి ఆంటీ!" అంటూ లోనికి దారితీసింది.

అక్కడ బాలక్రీస్తులా హాయిగా నిద్రిస్తున్నాడు 'ఏప్ర్యూ'. ఆ ముఖంలో ప్రశాంతత, దైవత్వం ఉన్నాయి. లలిత భాషకందని మహార్ణవంలో ఉంది. తనువునంతా కళ్ళు చేసుకొని, కళ్ళు ఆర్తితో నీటి చెరువులై, చూపులకు వేలవేల చేతులు మొలిచి, ఆర్తిగా వాడిని పైనుంచి కిందకు తడిమింది. 'నా తండ్రీ! ఎంత అందమైన ముఖం నీది. వెయ్యిచంద్రుల చల్లని వెలుగు నీది. వెండిమబ్బుల తళుకు నీది.' మనసు ఆర్ద్రమై ఆపుకోలేని దుఃఖంతో క్షణకాలంపాటు వెక్కి వెక్కి ఏడ్చింది. ఆ అలికిడికి వాడు ఉలిక్కిపడ్డాడు. వింతగా ఆగంతకులవైపు చూశాడు. ఎలీసా బ్యాగ్ తెరిచి చాక్లెట్లు, బొమ్మలు వగైరా వాడి మంచంపై పెట్టింది.

"వాణ్ణి ముట్టుకోనా?" లలిత భయంగా అడిగింది. "కారీ ఆన్ ఆంటీ!" లలిత వాణ్ణి గుండెలకు హత్తుకొని, నుదుటిపై ముద్దుపెట్టుకొని అనిర్వచనీయమైన ఆనందలహరిలో ఓలలాడింది.ఆ హడావిడికి, ఒత్తిడికి 'ఏప్ర్యూ' కీచుమంటూ ఏడుపులాంటి అరుపు అరిచాడు.

ఎలీసా 'మిషన్' అయిపోయింది. తల్లీ బిడ్డల సంగమాన్ని ఏర్పాటుచేసే 'మిషన్'. 'ఏప్ర్యూ'కి గుడ్‌బై చెప్పి ఇద్దరూ బయటకు వచ్చారు. ఏదో పనిమీద అటువైపు వచ్చిన సిస్టర్

లక్ష్మి ఆ దృశ్యాన్ని చూసి కెవ్వున అరిచింది. హాస్పిటల్ పెనుభయంతో హడావుడిగా మేలుకొంది. మాధురికి ఫోన్ చేసి జరిగిన విషాదం వివరించింది.

మైక్రోబయలాజికల్ లాబ్ అది. ఎయిడ్స్‌కి అవసరమైన ఎలీసా పరీక్షతో పాటు అన్ని రకాల అత్యాధునిక పరీక్షలు నిర్వహించగల విశాలమైన లాబ్ అది. భయంతో గడ్డగట్టుకు పోయి ఉంది డాక్టర్ మాధురి. పక్కనే ఆమె భర్త- పిల్లల వైద్యుడు డాక్టర్. ఆనంద్ కూడా ఉన్నాడు. కోర్టులో ముద్దాయిలా చూస్తోంది ఎలీసా. మృదువైన ఎలీసా వెయిన్‌లోకి పదునైన నీడిల్ నిర్దయగా దిగి, రక్తాన్ని సక్ చేయటం మొదలుపెట్టింది. పంటి బిగువున బాధను భరించింది ఎలీసా. మాధురి యుద్ధరంగంలో విహ్వలంగా పరిగెత్తే సైనికురాలిలా ఉంది. తన ఆశ, ఆనందం, జీవనసర్వస్వం ఎలీసానే. ఎలీసా సీరమ్ శాంపిల్‌పై ఎలీసా టెస్ట్ చేయబోతోంది. ఉదయం నర్సు ఫోన్ చేసినప్పుడు క్షణకాలంపాటు ఏం వింటోందో అర్థంకాలేదు. ఫోన్ పెట్టిన తరువాత గుండెల్లో అగ్నిపర్వతాలు పేలిన చప్పుడు. 'ఏప్యూ' గదిలో సీరమ్ శాంపిల్స్ వాడికోసం వాడుతున్న నీడిల్సూ ఉన్నాయి. ఏమాత్రం అప్రమత్తంగా ఉన్నా, హెచ్.ఐ.వి. వైరస్ పెనుశాపంలా అంటుకుంటుంది. లాబ్ లోపలి ప్రత్యేకమైన గదిలో ఉన్న ఎలీసా టెస్ట్ పరికరాలతో పరీక్ష చేయటం మొదలు పెట్టింది మాధురి. లాబ్ బయట ఉన్న విజిటర్స్ రూమ్‌లో కూర్చున్న ఎలీసాకు, ఎయిడ్స్‌లాంటి వ్యాధులున్న ప్రపంచాన్ని తలుచుకుంటే దిగులుగా ఉంది. ఆ వ్యాధి పేరుతో చెరసాలల్లాంటి గదుల్ని నిర్మించి, పసిపాపల్ని అందులో వేయటం తలుచుకుంటే దిగులుగా ఉంది. ఒక శరీరాన్ని మరో శరీరం ముట్టుకుంటేనే విషతుల్యం అయ్యే వ్యాధులు ఉన్న ప్రపంచం తలుచుకుంటే దిగులుగా ఉంది.

లాబ్ అద్దంలోంచి చూస్తే, బయట చల్లని మబ్బు ఒకటి ఎక్కడికో హడావిడిగా పరిగెత్తుతోంది. అల్లంతదూరాన ఉన్న కొండ ఒకటి మబ్బుల ఫ్లైయింగ్‌కిస్ అందుకొని పరవశిస్తోంది. తెల్లటి కొంగల గుంపు మబ్బులతో పోటీపడాలని హడావిడిగా పరిగెత్తుతున్నాయి. సాయంకాలపు సూర్యుడు గంభీరంగా, మనోహరంగా ఉన్నాడు. ఎంత పడినంతమేరా భూమి వెండి అంచు జరీచీర చుట్టినట్లుగా అందంగా ఉంది. ఎలీసాకు హఠాత్తుగా దుఃఖం వచ్చింది. రేపటినుంచి తను ఇవేమీ చూడదు. గాజుగది ఖైదులో మగ్గిపోవాలి. ఫ్రెండ్స్, కబుర్లు, ఆటలు, చాక్లెట్లు, కామిక్స్ ఏమీలేని ఖైదు జీవితం. కళ్ళవెంట కారే నిశ్శబ్దపు నదుల్ని తుడుచుకుంటూ మెల్లగా చప్పుడు చెయ్యకుండా లాబ్‌లోంచి బయటకు వచ్చింది. బయట ఉన్న నర్సుల్నిగాని, పేషెంట్లనుగాని పట్టించుకోకుండా ఏకాగ్రతతో, దీక్షగా అడుగులు వేస్తూ వెళ్ళిపోయింది -ప్రేమగా సాచిన స్నేహహస్తాల్లాంటి చౌరస్తాల్లోకి.

అరగంట తరువాత టెస్ట్ రిజల్టు వచ్చాక నుదుటిపై చెమట బిందువుల్ని తుడుచుకుంటూ డాక్టర్ మాధురి పట్టలేని ఆనందంతో "రిజల్ట్ ఈజ్ నెగిటివ్" అంటూ అరిచింది. ఆ శుభవార్త ఎలీసాతో చెప్పాలని విజిటర్స్ రూమ్‌కి వెళ్ళితే, అక్కడ ఎలీసా కనిపించలేదు. క్రూరమైన, కసాయి గుండెల నగరపు రోడ్లపై ఎలీసా కోసం వెతుకుతూనే ఉంది డాక్టర్ మాధురి.

• *ఇండియా టుడే, పక్షపత్రిక, 6–20 మార్చి, 1992* •